ఆమే నిర్ణేత

అతివ ఆకాశంలో సగం.. ఇంటి నిర్వహణలో ఆమె పాత్ర ప్రముఖం.. భారతీయ కుటుంబ వ్యవస్థలో మహిళకే ప్రాధాన్యం.. నేడు రాజకీయాలను శాసించడంలో ఆమే కీలకం..వెంకటగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికం. దీంతో వెంకటగిరి పాలకులుగా ఎవరుండాలన్న విషయంలోనూ ఆమే నిర్ణేతగా మారింది.

- నియోజకవర్గంలో మహిళ ఓటర్లే అధికం
- మొత్తం 2,3,6076 ఓట్లు
- మహిళా ఓటర్లు 1,2,0683 మంది





బీఎల్వోలతోసమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య (ఫైల్)

వెంకటగిరిరూరల్/సైదాపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకం కానున్నాయి. వారే వెంకటగిరి నియోజకవర్గంలో విజేతను నిర్ణయించనున్నారు. ఎమ్మెల్యే కుర్చీలో ఎవరిని కుర్చోపెట్టాలో.. ఎవరిని దూరం చేయాలన్న నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం గత 26వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం వెంకటగిరి నియోజకవర్గంలో ఓట్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. గతంలో మొత్తం 62,719 ఓట్లు ఉండగా, ప్రస్తుతం 2,36,076 ఓట్లు ఉన్నాయి. గతంలో పురుషులు 30,629 మంది ఓట్లు ఉండగా, ప్రస్తుతం 1,15,389 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో మహిళలు 32,088 మంది ఉండగా ప్రస్తుతం 1,20,683 మంది ఉన్నారు. మొత్తం పురుషుల ఓట్ల కంటే మహిళా ఓటర్లే 5,294 మంది అధికంగా ఉన్నారు. దీంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వెంకటగిరి స్థానం నిర్ణేతలుగా మహిళలు మారనున్నారు.

ఓటర్ల సవరణకు డిసెంబర్ 7 తుదిగడువు

ఓటర్ల సవరణలు, చేర్పులు, మార్పులకు డిసెంబర్ 7వ తేదీ గడువు ఉంది. ఈ మేరకు ఓటర్లు తమ వివరాలను సరిచేసుకునేందుకు ఆయా సచివాలయాలు, ఆన్‌లైన్ సెంటర్లలో సంప్రదించి, సవరణలు చేసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2024 జనవరి 4వ తేదీన ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 2,3 తేదీల్లో ఓటర్ల నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ఆ రెండు రోజుల్లో బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో ఉండి నూతన ఓటర్ల నమోదు ప్రక్రియతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు, సవరణలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



వెంకటగిరిరూరల్: వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లిరామ్‌కుమార్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి కాంతులు ప్రతి ఇంటి వెల్లివిరిసి, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఇంటింటా వెలుగులు నిండాలి

ఎమ్మెల్యే సంజీవయ్య



నాయుడుపేటటౌన్: ఇంటింటా వెలుగులు నిండాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు.ప్రజలు, అధికారులు, నాయకులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా సకల శుభాలు కలగాలని, సిరి సంపదలు నిండాలని, ఎల్లవేళలా ఆయురాగ్యోలు, ఐశ్వర్యాలతో తులతూగాలని కోరుకున్నారు.

నేడు రక్తదాన శిబిరం

చిట్టమూరు: మండలంలోని రాఘవవారిపాళెంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్జీపీ యువసేన సేవా సంస్థ అధ్యక్షుడు అమాస అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. సేవా సంస్థ ఏర్పాటు చేసి మొదటగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిబిరంలో నెల్లూరుకు చెందిన నోవా బ్లడ్ బ్యాంక్ వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



అయ్యప్ప పడి పూజ చేస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం ఆటస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన 11 బాణసంచా దుకాణాల వద్ద లైసెన్స్‌దారులు జాగ్రత్తలు తు.చ. తప్పక పాటించాలని సీఐ నరసింహరావు శనివారం సూచించారు. పట్టణానికి దూరంగా ఏఎల్‌సీఎం ఆటస్థలంలో దుకాణాలకు మధ్య దూరంగా ఉండేటట్లు చేసుకోవాలని లైసెన్స్ దారులకు సూచించామన్నారు.

ఆరూరులో అయ్యప్ప పడిపూజ

చిట్టమూరు: మండలంలోని ఆరూరులో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని విఘ్నేశ్వర ఆలయం వద్ద విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యేశ్వర స్వామి, అయ్యప్ప స్వామివారి చిత్రపటాల పీఠంపై ఉంచి, అరటి బోదెలతో పద్దెనిమిది మెట్లు ఏర్పాటు చేసి, విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. పద్దెనిమిది మెట్లపై కర్పూరం వెలిగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అయ్యప్ప మాలాధారణ గావించి భక్తులకు అన్నదానం చేశారు.

దుర్గామల్లేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గర్భగుడిలో ఉన్న దుర్గామల్లేశ్వరిదేవికి కేదారి వ్రత పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. ఆదివారం మధ్యాహ్నం కలశ స్థాపన చేసి అమ్మవారి పేరుతో కేదారి వ్రత పూజలను జరుపుతున్నట్లు తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

సైదాపురం: మండలంలోని సిద్ధలయ్య కోనలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంపీ నిధులు సుమారు రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. త్వరలో సిద్ధలయ్యకోనలో జరగనున్న తిరునాళ్లలోపు పనులు పూర్తికి చర్యలు తీసుకుంటున్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

పెళ్లకూరు: స్వర్ణముఖనదిలోకి ట్రాక్టర్లు వెళ్లకుండా శనివారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో దారికి అడ్డంగా గోతులు తీయించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశారు. కలవకూరు, పుల్లూరు గ్రామాల వద్ద స్వర్ణముఖినదిలోని ఇసుకను స్థానిక వ్యాపారులు ఇసుకను ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఎస్‌ఐ దారికి అడ్డంగా యంత్రాలతో గోతులు తీయించి వాహనాలు నదిలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

కళకళలాడుతున్న బాణసంచా దుకాణాలు



బాణసంచా కొనుగోలు చేస్తున్న పిల్లలు, పెద్దలు

చిల్లకూరు: దీపావళి పండుగ సందర్భంగా శనివారం నుంచే పెద్దలు, పిల్లలు బాణసంచా కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపడంతో ఆ దుకాణాలు కళకళలాడుతున్నాయి. వర్షాకాలమైనప్పటికీ ఈ ఏడాది నాలుగు రోజుల నుంచి వాతావరణం పొడిగా ఉండడంతో పిల్లలు, పెద్దలు అన్న తేడా టపాకాయలు కొనుగోలు మక్కువ చూపుతున్నారు. దీంతో ప్రతి దుకాణం రద్దీగా కనిపిస్తుంది. బాణసంచా దుకాణాల వద్ద పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం(వెంకటగిరి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలంటే సంక్షేమ సారథి అయిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 4వ వార్డు సాలికాలనీ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. నేదురుమల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, జేసీఎస్ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ నారాయణ, విప్ పీ లక్ష్మి, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, కౌన్సిలర్లు సుబ్బారావు, శంకరయ్య, శ్రీనివాసులు, నేతలు గోపాల్, వీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



దక్కిలి: దగ్గవోలులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న జేసీఎస్, ఎంపీపీ, మండల కన్వీనర్

దక్కిలి: రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మంచి భవిష్యత్తు లభిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనవాలసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని దగ్గవోలు సచివాలయంలో రెండో రోజు ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. అనంతరం దగ్గవోలు గ్రామ చావిడి దగ్గర వైఎస్సార్‌సీపీ పార్టీ జెండా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీ. పరుశురామయ్య, దగ్గవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శ్రీనివాసులు నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కే మీరయ్యానాయుడు, మస్తాన్ నాయుడు, రామస్వామి నాయుడు, ఎస్ రమణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కోటి నాయుడు, ఆరుణాచలం తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌లను అందజేస్తున్న వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి

సంక్షేమంలో సువర్ణ అధ్యాయం

నాయుడుపేటటౌన్: సంక్షేమంలో సువర్ణ అధ్యాయం సృష్టిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఆయన 10 వార్డు పరిధిలోని ఆర్ముగం నగర్, రామకృష్ణాపురం, ముగాంబిక గుడివీధి తదితర ప్రాంతాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటా వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డిని స్థానికులు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఘనంగా మౌలానా జయంతి



మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



స్టేడియంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం గూడూరు పట్టణంలోని ఘనంగా జరిగాయి. పాతబస్టాండు సమీపంలోని అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ మైనార్టీలు, క్రైస్తవులు, హిందువులు, మహనీయుల విగ్రహాలను పెట్టాలని తనను కోరిన వెంటనే గూడూరు ప్రజలకు తనవంతు సేవ చేయాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల సహకారంతో సొంత నిధులు వెచ్చించి మౌలానా అబుల్ కలాం ఆజాద్, జ్యోతిరావు పూలే దంపతులు, బాబూ జగజ్జీవన్ రామ్, మదర్ థెరిస్సా, స్వామి వివేకానంద విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. అందరూ గౌరవించుకోదగ్గ మహనీయుడు అబుల్‌కలాం ఆజాద్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజలకు ముందస్తు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బీ విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, నాయకులు అజీజ్‌ఖాన్, ఏ మురళి, సతీష్‌రెడ్డి, మహేంద్ర యాదవ్, బీసీ నాయకులు భాస్కర్‌గౌడ్, గోవింద నాయక్, సురేష్‌రెడ్డి, సాయి, అహ్మద్‌బాషా, ఇమ్రాన్, షరీఫ్, మజాహర్, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడల్లో రాణించే క్రీడాకారుల సౌకర్యార్థం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు రూ.50 వేలు వెచ్చించి క్రికెట్ కిట్‌లను శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని నియంత్రణలో ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. స్టేడియంలో నిత్యం వాకింగ్ చేసే వారందరూ చాలా ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ఎంపీపీ బూదూరు గురవయ్య, వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, కందలి సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు మహేంద్ర యాదవ్, అశోక్, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలు.. దేశానికే ఆదర్శం



ప్రజలకు నమస్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలు దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఏడో వార్డు ఎన్టీఆర్ కాలనీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించేందుకు కాలేజీ మిట్ట ప్రాంతంలో గడప గడప వద్దకు వెళ్లిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసే ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరేలా సీఎం మదిలో నుంచి పుట్టిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ఎందరో ప్రజలకు భరోసాగా నిలుస్తున్నాయన్నారు. కుల, మత పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కె చంద్రశేఖర్, వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, విప్ పీ లక్ష్మి, కౌన్సిలర్లు వహిద, ఏ శంకరయ్య, శ్రీనివాసులు, నేతలు మల్లిరెడ్డి , సీహెచ్ మురళి, గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశి లలక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి, వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఊజంల్‌సేవ నిర్వహించారు.

దీపావళికి ముస్తాబవుతున్న కోన



పెంచలకోన క్షేత్రం

రాపూరు: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆదివారం జరగనున్న దీపావళి పండుగకు ముస్తాబవుతోంది. దీపావళి పర్వదినం సందర్భంగా రథోత్సవం, నరకాసుర వధ కార్యక్రమాలు నిర్వహించడం దేవస్థానంలో ఆనవాయితీ. ఇందుకోసం నరకాసుని బొమ్మను తయారు చేస్తున్నారు. ఉదయం స్వామివారి మూలమూర్తికి పాలు, తేనే, పెరుగు, నెయ్యి, చందనం, పసుపు, కుంకుమ, నారికేళ జలం, తులసీ జలం, వివిధ పళ్లరసాలతో స్నపన తిరుమజనం నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి దేవతల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి,సత్యభామగా అలంకరించి రథంపై కొలువుదీర్చి, కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం, నరకాసురవధ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అలాగే ఆదివారం స్వాతి నక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో నరసింహుడికి చందనాలంకరణ, ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ



పల్లకీసేవలో లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామివారి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం కార్యక్రమానికి సాదం సుబ్రహ్మణ్యం, మంజులమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం స్వామి వారితో పాటుగా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవ మూర్తులను పల్లకీపై కొలువుదీర్చి, ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్‌తో పాటుగా ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితులు

చిట్టమూరు: మల్లాం గ్రామంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో రెండో రోజు శనివారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇటీవల ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో తెలిసీ, తెలియక జరిగిన పొరపాట్లకు ప్రాయశ్చిత్తం కోసం ఆలయాభివృద్ధి, లోక కల్యాణార్థం పతిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఆలయంలో గణపతి, లక్ష్మీ, నవగ్రహ హోమాలు, హారతి తదితర పూజలు వేద మంత్రోచ్చారణ నడుమ నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో గోపూజ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమాలను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం పవిత్రాల సమర్పణ, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంఘాల నాయకులు

ఓజిలి: ఏకలవ్య గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మౌలిక వసతుల మెరుగుకు తమ వంతు కృషి చేస్తామని గిరిజన సంఘాల నాయకులు తెలిపారు. రెండు రోజులు క్రితం గురుకుల పాఠశాలలో విద్యార్థులు కల్తీ ఆహారం తిని, అస్వస్థతకు గురైన విషయాన్ని సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరుకు చెందిన యానాది కలయక మహాకూటమి, ఏపీ యానాది గిరిజన సమాఖ్య నాయకులు శనివారం గురుకుల పాఠశాలకు చేరుకుని అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలోని వాతావరణం పూర్తిగా పరిశీలించగా 420 మంది విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు ఒక్కరే ఉండడంతో అవి అపరిశుభ్రం ఉంటున్నాయని గుర్తించి, ప్రిన్సిపల్ రజని కుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె సిబ్బంది కొరతపై ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గిరిజన నాయకులతో కలసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యానాది కలయక సంఘాల మహా కూటమి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అవల మడుగు కళావతి, ఎం సుబ్బయ్య, ఏపీ యానాది గిరిజన సమాఖ్య నాయకులు కుడుముల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.